
సాక్షి చిత్తూరు
గురువారం । 27 । జూన్ । 2024



శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం
ముక్కంటి ఆలయంలో బుధవారం అక్షర దీవెన ఉత్సవం పేరిట సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. - 8లో



సిరి.. 'వరి'ంచేలా..!
మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను రైతులు సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. - 8లో



గని కార్మికుల సంక్షేమానికి..
గని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ అధికారి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ మొదటి సంవత్సరం ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షకు 5,817 మంది దరఖాస్తు చేసుకోగా 2,597 మంది ఉత్తీర్ణత చెందారు. 3,220 మంది ఫెయిల్ అయ్యారు. జిల్లాలో 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ఒకేషనల్ గ్రూపులో 814 మందికి గాను 368 మంది ఉత్తీర్ణత చెందారు. 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు www.bieap.apcfss.in వెబ్ సైట్‌లో జూలై 1వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా వెల్లడించారు.

నేను బడికి పోతా పకడ్బందీగా నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల అడ్మిషన్ల పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న నేను బడికి పోతా కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. ఆయన బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడుతూ ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లు కలిసికట్టుగా విజయవంతంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. హెచ్‌ఎంలు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, గ్రామ ఎడ్యుకేషన్ సెక్రటరీల సహకారంతో సీఆర్‌పీల ప్రోత్సాహంతో బడి బయటి పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలని డీఈఓ ఆదేశించారు.

ఆధార్‌లో తప్పుల సవరణ


సుశీలాదేవి

తిరుపతి అర్బన్: నూతనంగా ఆధార్ కార్డు నమోదుతోపాటు తప్పులను సవరణకు అవకాశం కల్పిస్తున్నట్లు సచివాలయాల తిరుపతి జిల్లా అధికారి డి.సుశీలాదేవి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డు ప్రింట్ కోసం రూ.30, ఇంటి చిరునామా, పుట్టిన తేది, పేరు, మొబైల్ నంబర్, లింగం, జిల్లా పేరు, ఈ మెయిల్ ఐడీ మార్పునకు రూ.50, బయోమెట్రిక్, ఫొటో అప్డేట్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సచివాలయాల పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తారని వెల్లడించారు. ఈ క్రమంలోనే 5 నుంచి 7, 15 నుంచి 17 ఏళ్ల వారికి ఉచితంగా బయోమెట్రిక్ అప్డేట్ చేస్తారని తెలిపారు. 2011- 16 మధ్యలో ఆధార్ పొందిన వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు.



కంచర్ల షో

సీఎం చంద్రబాబు పర్యటనలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధిపత్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రిని సీనియర్ నేతలు కలిసేందుకు సైతం ఆంక్షలు విధించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక కార్యకర్తలనైతే తన నిరంకుశ వైఖరితో అడుగడుగునా అవమానించారని పార్టీ శ్రేణులే ఆక్షేపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లేలా వ్యవహరించారని మండిపడుతున్నాయి. ఆయన అనుమతి లేనిదే సీఎం సమీపంలోకి సైతం వెళ్లలేని పరిస్థితిని కల్పించారని ఆవేదన చెందుతున్నాయి. చివరకు పోలీసులు.. ఉన్నతాధికారులను తన కనుసన్నల్లోనే నడిపించారని ఆరోపిస్తున్నాయి. అభిమానంతో అధినేతను కలవాలని వస్తే ఇదెక్కడి పెత్తనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

- ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో ఎమ్మెల్సీ శ్రీకాంత్‌దే పెత్తనం
- చంద్రబాబుని ఎమ్మెల్యేలు కలవాలన్నా ఆయన అనుమతి తప్పనిసరి
- పోలీసులు, అధికారులు అందరూ శ్రీకాంత్ కనుసన్నల్లోనే
- సీనియర్లు, కూటమి శ్రేణులకు అడుగడుగునా అవమానం
- పార్టీ కార్యకర్తల ఆందోళనతో బాబును కలిసేందుకు పర్మిషన్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పం నియోజకవర్గానికి విచ్చేశారు. ఇక అప్పటి నుంచి మొత్తం పర్యటన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కనుసన్నల్లోనే సాగడం టీడీపీ శ్రేణులను అసంతృప్తికి గురిచేసింది. ఎవరైనా ముఖ్యమంత్రిని కలవాలంటే ఎమ్మెల్సీ చెప్పాలి. అది ఎమ్మెల్యే అయినా.. సీనియర్, టీడీపీ, జనసేన నేతలైనా సరే. ఆయన చెప్పకపోతే సీఎంని కలిసే అవకాశమే లేదు. అలా ఒకరోజంతా ఓపికగా వేచి చూసిన కూటమి నేతలు, కార్యకర్తలు సహనం నశించి బుధవారం ఉదయం ఆందోళనకు దిగారు. పరిస్థితి చేయిదాటుతోందని గ్రహించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఎట్టకేలకు సీఎం చంద్రబాబుని కలిసేందుకు అవకాశం కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల్లో ఎవరో ఒకరికి మంత్రి పదవి ఇచ్చి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని కూటమి ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు మొదటి సారిగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి వచ్చారు. మంగళవారం కుప్పానికి చేరుకున్న చంద్రబాబు.. బుధవారం సాయంత్రం వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధికారిక, పార్టీ కార్యక్రమాలకు హాజరైన చంద్రబాబుని కలిసేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా.. అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి కూడా కూటమి ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రిని కలవొచ్చని ఆశగా కుప్పానికి చేరుకున్న వారికి నిరాశే ఎదురైంది.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వకపోవడం లోటే..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంత్రి వర్గంలో పెద్దపీట వేశారు. ఏకంగా ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ విప్ పదవి సైతం ఇచ్చారు. జిల్లాపై తనకున్న అభిమానం చాటుకున్నారు. అయితే ఇప్పుడు అదే స్థాయిలో ఎమ్మెల్యేలు గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పడినా.. జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నా మంత్రి వర్గంలో ఒక్కరంటే ఒక్కరికి కూడా చోటు కల్పించకపోవడంపై జిల్లా వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరికైనా మంత్రి పదవి ఇచ్చి ఉంటే.. నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఇలా ఉండేది కాదనే అభిప్రాయపడుతున్నారు. సీఎం చంద్రబాబు తన సొంత జిల్లా ఎమ్మెల్యేలకే న్యాయం చేయకపోతే ఎలా? అని ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

అడ్డంకులు.. అవమానాలు

ఎమ్మెల్యేల నుంచి.. సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో సీఎం చంద్రబాబుని కలిసేందుకు ప్రయత్నించారు. అయితే వారికి అడుగడుగునా అడ్డంకులు, అవమానాలే ఎదురైనట్లు ఇద్దరు ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం అంటే సెక్యూరిటీ సహజమే అయినా.. ఎమ్మెల్యే అయితే పెద్దగా తనిఖీలు లేకుండా నేరుగా పంపేస్తుంటారు. అలాంటిది కుప్పంలో ఎమ్మెల్యేలకు చేదు అనుభవమే ఎదురైంది. తాను ఎమ్మెల్యేని చెబుతున్నా.. పోలీసులు పట్టించుకోలేదని, పంపేందుకు ససేమిరా అన్నారని తెలిపారు. ఐడీ కార్డు ఉందా? మీరు ఎమ్మెల్యేనేనా? రుజువు ఏంటి? అంటూ సవాలక్ష ప్రశ్నలతో తీవ్ర అవమానాలకు గురిచేసినట్లు చెబుతున్నారు. 'సీఎంని కలవాలంటే.. ఎమ్మెల్సీ శ్రీకాంత్ నుంచి ఫోన్ చేయించండి లేదా చెప్పించండి' అంటూ సమాధానం ఎదురైందంటున్నారు. సరే శ్రీకాంత్‌తో చెప్పిద్దాం అంటే ఆయన అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులే కాకుండా.. అధికారులు సైతం ఎమ్మెల్సీ కనుసన్నల్లో నడిచినట్లు వివరించారు. ఎమ్మెల్యే అనే గౌరవం కూడా లేకుండా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే స్థానిక నాయకులకు కూడా సీఎం చంద్రబాబుని కలిసే అవకాశం లేకుండా పోయినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక నాయకులందరినీ ఎమ్మెల్సీ శ్రీకాంత్ దూరం పెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆందోళనతో దిగొచ్చినా ప్రయోజనం శూన్యం

కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం.. సీఎం కుప్పానికి రావడంతో పలువురు టీడీపీ, బీజేపీ, జనసేననేతలు చంద్రబాబుని కలిసేందుకు ఉత్సాహం చూపించారు. మంగళవారం ఉదయం నుంచి వేచి ఉన్న వారికి బుధవారం కూడా చంద్రబాబుని కలిసే అవకాశం రాలేదు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిని కలవాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్‌తోపాటు పోలీసులను ప్రాధేయపడినా ప్రయోజనం లేకపోవడంతో ఆగ్రహించిన కూటమి శ్రేణులు ఆందోళనకు దిగాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ వారిని లోనికి పంపించమని పోలీసులను ఆదేశించారు. అయితే లోపలికి వెళ్లినా.. కొందరికి మాత్రమే సీఎం చంద్రబాబుని కలిసే అవకాశం దొరికిందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీ న్యూరాలజీ విభాగంలో మెడికల్, పారామెడికల్ రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు జూలై 4వ తేదీ ఉదయం 10 గంటలకు స్విమ్స్ కమిటీ హాల్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించారు ఇతర వివరాలకు స్విమ్ వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. విద్యార్హత, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

శ్రీవారి దర్శన టికెట్లు గంటల్లోనే విక్రయం

తిరుమల : సెప్టెంబర్‌కు సంబంధించి శ్రీవారి దర్శన టికెట్‌లను బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. గంటల్లోనే భక్తులు అన్ని టికెట్లు కొనుగోలు చేసేశారు. ఆర్జిత సేవా టికెట్లను గంటా 25 నిమిషాల్లో, అంగప్రదక్షిణ టికెట్లు 2 నిమిషాల 30 సెకన్ల వ్యవధిలో, వయోవృద్ధులు, వికలాంగుల ఉచిత దర్శన టికెట్లు 10 నిమిషాల 11 సెకన్ల వ్యవధిలో, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు 2గంటలా 6 నిమిషాల్లో, తిరుపతి, తిరుమల గదుల కోటాను గంటా 40 నిమిషాల్లోనే భక్తులు బుక్ చేసుకోవడం విశేషం.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,824 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,462 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.01 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం రాత్రి విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మే 24వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1,966 మంది పరీక్షలు రాయగా 1,550 మంది ఉత్తీర్ణత చెందారు. జిల్లాలో 78.84 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఆదర్శవంతంగా 'సఖీ' సేవలు

తిరుపతి అర్బన్ : సఖీ-వన్‌స్టాప్ సెంటర్లు ఆదర్శవంతంగా సేవలందించాలని జాతీయ మానవహక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ యోగేష్ దూబే స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్, గృహ హింస చట్టం విభాగ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సఖీ కేంద్రాలకు వచ్చే ప్రతి మహిళ, బాల బాలికలను తమ కుటుంబ సభ్యులుగా భావించి అన్ని విధాలా అండదండగా ఉండాలని ఆదేశించారు. వన్ స్టాప్ సెంటర్ 181 టోల్ ఫ్రీ నంబర్‌కు ఇంటిగ్రేట్ చేయబడిందని తెలిపారు. ముఖ్యంగా మహిళలతో పాటు 18 ఏళ్లలోపు బాలికలు జువైనల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ 2000, ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్-2012 కింద వచ్చే బాధితులకు అండగా ఉండాలని కోరారు. ప్రతి కేసును సీరియస్‌గా తీసుకోవాలని బాధితులకు అందుతున్న సేవలు, వారి అభిప్రాయాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలలో పని చేస్తున్న మహిళలు లైంగిక వేధింపులకు గురి కాకుండా వారి కార్యాలయంలో తప్పనిసరిగా స్త్రీలతో అంతర్గత కమిటీలు వేసి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, అదనపు ఎస్పీ వెంకట్రావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జయలక్ష్మి, డీఈఓ శేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, సఖీ వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ సుజాత, గృహ హింస చట్టం విభాగ కౌన్సిలర్ సుగుణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ యోగేష్ దూబే

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష ఫలితాలను సర్కారు బడుల హెచ్‌ఎంలు వెబ్‌సైట్‌లో పరిశీలించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఇంటర్ వరకు ఉపకారవేతనాలను అందుకుంటారని తెలిపారు. ఏవైనా సందేహాలున్నట్లైతే డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని డీఈఓ వెల్లడించారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బి.చంద్రయ్యను నియమిస్తూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. వర్సిటీలోని అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహ్మద్ హుస్సేన్ తన పదవికి రాజీనామా చేసి మాతృవిభాగం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేశారు.

గుజ్జు గుప్పిట్లో తోతాపురి



మామిడి ధరలను గుజ్జు పరిశ్రమలు గుప్పిట్లో పట్టుకున్నాయి. ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ అయి మామిడి ధరను భారీగా తగ్గించేశారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాతావరణ ప్రభావంతో ఈసారి మామిడి దిగుబడి కుదేలైంది. రైతులు దిగుబడిపై ఆశలు వదులుకున్నారు. ఆ కాస్త పంటకైనా గిట్టుబాటు ధర లభిస్తుందని భావించారు. తొలుత మామిడి ధరలు ఊరించినా.. చివరకు నట్టేట ముంచుతున్నాయి. వ్యాపారులు సిండికేట్ కావడంతో ధరలు పతనమవుతున్నాయి.


తోతాపురిరకం మామిడితోట (ఇన్‌సెట్) మామిడి కాయలు

- ఫ్యాక్టరీల సిండికేట్‌తో ధర పతనం
- జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్
- అయోమయంలో మామిడి రైతులు

పలమనేరు/కాణిపాకం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చూడాలంటూ కలెక్టర్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. కానీ వీరిమాటలు నీటి మూటలుగానే మారాయి. మేం చెప్పిందే ఖాయమంటూ సిండికేట్‌గా మారిన మామిడి గుజ్జు పరిశ్రమలు అధికారుల మాటను బేఖాతర్ చేస్తున్నాయి. దీంతో ఉన్నట్టుంది మొన్నటిదాకా టన్ను తోతాపురి రూ.28 వేలు వరకు ఉండగా బుధవారం నాటికి రూ.23 వేలకు పడిపోయింది. ఈ వారం రోజులు మాత్రమే సీజన్‌లో కాయలు ఎక్కువగా మార్కెట్‌కు రానున్న సమయంలో ఎలాగైనా ధరలు తగ్గించి లాభపడాలని గుజ్జు పరిశ్రమలున్నట్టు తెలుస్తోంది. మరోవైపు జిల్లాలోని పలు మామిడి గుజ్జు ఫ్యాక్టరీలు తనకు సరుకు కావాలంటూ రైతులకు మెసేజ్‌లు పెడుతున్నాయి. దీంతో ఫ్యాక్టరీలకు సరుకు అవసరమున్నప్పటికీ ఎందుకు ధరలను తగ్గిస్తున్నారని మామిడి రైతులు ప్రశ్నిస్తున్నారు.

భారీగా తగ్గిన దిగుబడి

మామిడి పంటకు రైతులు ఏడాదికి ఎకరాకు రూ. 30వేలు చొప్పునవ్యయం చేస్తున్నారు. ప్రధానంగా ఎరువులు, పురుగు మందుల పిచికారీకి మాత్రమే అధికంగా ఖర్చు పెడుతున్నారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈ సారి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఓ వైపు వాతావరణం, మరోవైపు పురుగు మందులు పనిచేయకపోవడమే పంట దిగుబడి రావకపోవడానికి ప్రధాన కారణమని రైతులు వాపోతున్నారు. ఇది చాలదన్నట్లు కోతల బెడద ఎక్కువైంది. ఇవన్నీ వెరసి ఎకరాకు 15 టన్నులు రావాల్సి ఉండగా, 10 శాతం పంట మాత్రమే దిగుబడి బాగుంది. ఎకరాకు 5నుంచి 10 టన్నుల కాయలు దిగుబడి వచ్చింది. తోతాపురి రకం ఈ మాత్రం ఉండగా మిగిలిన రకాలు రైతులు ఆశించిన మేర దిగుబడి రాలేదు.

వారం రోజుల్లోనే ధరలు పతనం

ఈనెల 21వతేదీన తోతాపురి మండీలు, ర్యాంపుల్లో టన్ను రూ.26వేలు, పరిశ్రమల్లో రూ.27వేలు ఉంటే ఈ నెల 22న మండీల్లో రూ.28వేలు, ఫ్యాక్టరీలో 29 వేలు పలికి, 23న ఉన్నట్టుండి మండీల్లో రూ.25వేలకు, పరిశ్రమల్లో రూ.27 వేలకు ధర పడిపోయింది. 24న ధర మరీ తగ్గుముఖం పట్టి టన్ను రూ.23 వేలు, పరిశ్రమల్లో రూ.25 వేలకు పడింది. 25న ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై కొందరు మామిడి రైతులు కుప్పంలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబుకు సైతం విన్నవించినట్టు తెలిసింది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కొన్ని రోజుల కిందట కలెక్టర్ మామిడి ధరను నిర్ణయించారు. రైతుల నుంచి ఆ ధర ప్రకారమే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రకటన తో వ్యాపారులు, ఫ్యాక్టరీ నిర్వాహకులు ఒక్కరోజు హడావుడి చేశారు. మరునటి రోజు నుంచి ఆ ధరలో కోతలు పెట్టారు. టన్నుకు రూ. 2వేలే కదా అనుకుంటే మళ్లీ రూ. 2వేలు తగ్గించారు. కోతలు ముగింపు దశలో కూడా మామిడి ధరలు తగ్గడంతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సీజన్ ముగిశాక ధరిస్తే ఏం లాభం


ఉమ్మడి జిల్లాలో 20 దాకా మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇక్కడ పండిన పంటలో 60శాతం జిల్లాతోపాటు పొరుగురాష్ట్రాల్లోని జ్యూస్ ఫ్యాక్టరీలకు చేరుతోంది. మామిడి కాయలను పల్ప్(మామిడి గుజ్జు) తయారుచేసి ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ తొలివారంలో మొదలై జూలై తొలివారానికి తోతాపురి సీజన్ ముగుస్తుంది. ఆపై ఆగస్టు తొలివారం దాకా నీలం లాంటి రకాలతో ఇక్కడ సీజన్ పూర్తవుతుంది. వ్యాపారుల కొనుగోళ్లు, మరో 20శాతం రైతులు ప్రధాన మార్కెట్‌లకు కాయలను ఏటా విక్రయిస్తున్నారు. కొందరు రైతులు మాత్రం నేరుగా ఫ్యాక్టరీలకే తరలిస్తుంటారు. ఇప్పుడు తోతాపురి కాయలు విధిగా మార్కెట్‌కు పోవాల్సిన వేళ ధరలను తగ్గించడంతో రైతులకు నష్టాలు వస్తున్నాయి. సీజన్ ముగిశాక ధరలు పెంచినా కాయలుండవు కాబట్టి రైతులకు ఒరిగేదేమీ ఉండదు.

ప్రతి సారీ గోల్‌మాల్ చేస్తారు



ప్రతి సారీ మంచి కోతలున్నప్పుడే గోల్‌మాల్ చేస్తారు. తోటల్లో కాయలు తగ్గితే ధరలు పెంచి ఏం లాభం. అధికారులు చెప్పినట్టు టన్నుకు రూ.30 వేలు తగ్గకుండా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. లేదంటే రైతులకు నష్టం తప్పదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మామిడి ధరల విషయంలో సిండికేట్ హవా మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.
– ఉమాపతి మామిడి రైతు, ముసలిమడుగు

రైతుకు విలువ లేదు




ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా పంటను కాపాడే రైతుకు విలువ లేదు. మధ్యవర్తులు, సిండికేట్ దారులు మా కష్టార్జితాన్ని మింగేస్తున్నారు. పరిశ్రమ నిర్వాహకుల్ని ప్రశ్నిస్తే రైతులు గొంతు నొక్కేస్తున్నారు. కోతలు ముగింపు దశలో కూడా ధరలను తగ్గించడం సరికాదు. అధికారులు స్పందించాలి. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.
– మోహన్‌రెడ్డి, పూతలపట్టు

దిగుబడి లేదు.. ధర లేదు



ఈసారి మామిడి దిగుబడి పూర్తిగా లేదు. కాస్తో..కూస్తో వచ్చిన కాయలను కూడా కోతులు వదిలిపెట్టలేదు. దిగుబడి లేకపోయినా, రేట్లు బాగుంటాయని అనుకున్నాం. ఆ రేట్లు కూడా సంతృప్తిని ఇవ్వడం లేదు. ఇప్పుడు టన్ను రూ.23 వేలు అంటున్నారు. ఇలా అయితే రైతులకు పెట్టుబడి కూడా రాదు. ఈ సిండికేట్‌ను అడ్డుకునేదెవరో?
– వాసు, చిత్తూరు

పల్ప్ పరిశ్రమ నిర్వాహకులను ఆదేశించాం



మామిడి రైతుకు గిట్టుబాటు ధర టన్ను రూ.30 వేల దాకా ఉండాలని ఇప్పటికే కలెక్టర్‌తోపాటు తాము కూడా గుజ్జు పరిశ్రమలకు ఆదేశాలు జారీచేశాం. కానీ ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తప్పవు. ఇప్పుడు కాయలు కోతలకొచ్చే సమయంలో ధరలు తగ్గించరాదు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం.
– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

పలమనేరు టు లడఖ్ సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న బషీర్, (ఇన్‌సెట్) బషీర్

పలమనేరు: పర్యావరణ పరిరక్షించుకోవాలన్న తలంపుతో పలమనేరు పట్టణానికి చెందిన యువకుడు పలమనేరు నుంచి లడఖ్ దాదాపు 4వేల కిలోమీటర్లు సైకిల్ యాత్రకు బయల్దేరాడు. ఈ విషయం సోషల్‌మీడియా ద్వారా వైరల్ అవుతోంది. స్థానిక బ్యాంకర్స్ కాలనీకి చెందిన బషీర్ రెండు వారాల క్రితం పలమనేరు నుంచి సైకిల్‌పై లడఖ్‌కు బయల్దేరాడు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణా, మహారాష్ట్ర మీదుగా 1300 కిలోమీటర్లు వెళ్లాడు. ఇక మధ్య ప్రదేశ్, ఢిల్లీ మీదుగా లడఖ్ వెళ్లనున్నట్టు తన బ్లాగ్‌లో పేర్కొన్నాడు. సెవన్‌ట్రీస్ అనే లోగోతో సేవ్‌ది ఫారెస్ట్ పేరిట తన యాత్రను చేపడుతున్నాడు. తనతోపాటు పలమనేరు పేరును నిలబెట్టేలా ఈ సైకిల్ యాత్ర జిల్లాలోనే తొలిసారిగా చేయడం గొప్పగా ఉందని తెలిపాడు.

కారుటైరు పేలి పలువురికి గాయాలు

చిత్తూరు అర్బన్: కారు టైరు పేలడంతో, బండి బోల్తా పడడంతో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చిత్తూరు నగరం తేనెబండ సమీపంలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం తిరుమలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో తేనెబండ వద్ద కారుటైరు పేలింది. దీంతో కారు బోల్తా బడింది. ప్రయాణిస్తున్న 8మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సిరి..‘వరి’ంచేలా..!

- మార్కెట్‌లో డిమాండ్ మేరకే వరి పంట సాగు
- 1010 ఎంటీయూ, కేఎన్ఎం 1638 రకాలపై మొగ్గుతున్న రైతులు
- రబీ సీజన్ మాదిరిగా ఖరీఫ్‌లోనూ అమలు
- తెగుళ్లు తక్కువ.. దిగుబడి ఎక్కువ కావడంతో ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



ఎంటీయూ 1010 వరి రకం పంట



కేఎన్ఎం 1638 వరి రకం పంట

తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో సైతం రైతులు రబీలో అమలు చేసిన ఫార్ములానే పాటిస్తున్నారు. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న వరి వంగడాలనే సాగు చేస్తున్నారు. ప్రధానంగా తెగుళ్లు తక్కువగా సోకే రకాలతోపాటు గిట్టుబాటు ధర ఉండే పంటలవైపే మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో రెండు రకాల వరి పైర్లను అధికంగా సాగు చేస్తున్నారు. అందులో 1010 ఎంటీయూ రకం, కేఎన్ఎం 1638 రకాలను ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకుంటున్నారు. ఈ రకాల పంటలకు తెగుళ్లు సోకడం చాలా అరుదు. అలాగే మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. ఈ సీజన్‌లో మొత్తంగా 50,350 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అందులో 1010 ఎంటీయూ రకం 32,500 ఎకరాలు, కేఎస్ఎం 1638 రకం వరి పంటను 17,500 ఎకరాల్లో సాగుచేశారు. కేవలం 350 ఎకరాల్లో మాత్రమే ఇతర రకాల వరి పైర్లు సాగుబడిలో ఉన్నాయి.

గిట్టుబాటు ఎక్కువే..

1010 ఎంటీయూ, కేఎస్ఎం 1638 వరి క్వింటా ధర రూ.2,300 నుంచి రూ.2,400 వరకు పలుకుతోంది. మిగిలిన రకాల వరి పంటలకు రూ.1,000 నుంచి రూ.1,150 మాత్రమే దక్కుతోంది. మరోవైపు ఈ రెండు పంటల దిగుబడి బాగా వస్తుంది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు పండుతోంది. దీంతో ఎక్కువ మంది రైతులు ఈ రకాలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రబీ సీజన్ పద్ధతిలోనే..

సీజన్ వారీగా ఎలాంటి రకాల వరి పంటలు పండించుకోవాలో వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగానే రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదే క్రమంలో రబీలో సైతం అప్పటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆర్ఎస్ఆర్–15048, బీపీటీలు–5204 రకాలను అధికారులు సూచించారు. ఆ మేరకు ఆయా రకాలను జిల్లాలో సుమారు 82శాతం మంది రైతులు సాగు చేసి అధిక దిగుబడి, తద్వారా ఎక్కువ ఆదాయం పొందారు. అదే తరహాలో ఖరీఫ్‌లో సైతం వ్యవసాయశాఖ అధికారుల సలహా మేరకు 1010 ఎంటీయూ, కేఎస్ఎం 1638 రకాల వరి పంటల సాగు చేపట్టారు.

మంచి ఆదాయం

గత రబీ సీజన్‌లో ఆర్ఎస్ఆర్–15048 రకం పంటను 2.5 ఎకరాల్లో సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. క్వింటాల్ రూ.2,500లకు అమ్మేశా. పెట్టుబడి పోను రూ.1.25 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో 1010 ఎంటీయూ 2.5 ఎకరాల్లో సాగు చేశా. వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సాహంతోనే ఈ పంటను ఎంపిక చేసుకున్నా. మార్కెట్‌లో ఈ పంటకు బాగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో మంచి ఆదాయం వస్తుంది అనుకుంటున్నా.

– కన్నెప్ప, రైతు,తొండమనాడు

డిమాండ్ మేరకే..

మార్కెట్‌లో మంచి డిమాండ్ మేరకే పంటను ఎంపిక చేశాం. గత రబీలో 4.5 ఎకరాల్లో బీపీటీలు 5204 వరి రకం సాగుచేశాం. మంచి ధర వచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో కేఎస్ఎం 1638 రకం పంటను సాగు చేస్తున్నాం. ఈ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. వ్యవసాయశాఖ అధికారులు చక్కటి సలహాలు అందిస్తున్నారు. దీంతో ఈ పంటను ఎంపిక చేసుకున్నాం. దిగుబడి బాగా వస్తుందని భావిస్తున్నాం.

పుల్లయ్య, రైతు, తిరుపతి రూరల్ మండలం

క్షేత్రస్థాయిలో ప్రోత్సాహం

రైతులకు ఆదాయం తీసుకువచ్చే వరి రకాలనే సూచిస్తున్నాం. క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించి ప్రోత్సాహం అందిస్తున్నాం. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని వరి వంగడాలను విత్తుకుంటే తప్పకుండా అధిక ఆదాయం పొందవచ్చు. అందుకే ఎప్పటికప్పుడు అన్నదాతలను ఆ దిశగా నడిపిస్తున్నాం.

– మురళీకృష్ణ, వ్యవసాయశాఖాధికారి, చిత్తూరు

లాటరీలో రైతుకు 50 గ్రాముల వెండి



రైతుకు బహుమతిని అందిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : సచివాలయంలోని రైతు భరోసా కేంద్రాల్లో (2023–24) రబీ సీజన్‌లో కోరమాండల్ ఎరవులు కొనుగోలు చేసిన రైతుకు లాటరీ పద్ధతిలో 50 గ్రాముల వెండి బహుమతిగా దక్కింది. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వారు గ్రోమోర్ రైతు సంబరాలు పేరుతో ఆర్‌బీకేల్లో కోరమాండల్ ఎరువులను కొనుగోలు చేసిన వారికి అప్పట్లో కూపన్లు అందించారు. ఈ కూపన్లను లాటరీ తీయగా, బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన వై.కిరణ్ అనే రైతు బహుమతి దక్కించుకున్నాడు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్, కోరమాండల్ సంస్థ సీనియర్ మేనేజర్ ఏవీయస్ విజయ్ చేతులమీదుగా రైతుకు బహుమతి అందించారు.

ఆర్ఐకు డీఎస్పీగా ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆర్మ్డు రిజర్వు (ఏఆర్)లో ఆర్ఐగా పనిచేస్తున్న నీలకంఠేశ్వర్ రెడ్డికి డీఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పోలీసు శిక్షణ కేంద్రం (అప్పా)కు ఆయన్ను బదిలీ చేసింది.

మిగులు సీట్లకు ప్రవేశ పరీక్ష రేపు

రాపూరు : కండలేరు జలాశయం వద్ద అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్లకు శుక్రవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ భారతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గురుకులంలో 6, 5, 9వ తరగతులకు సంబంధించి 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థినులు ఆధార్, కుల ధ్రువీకరణపత్రం, ఫొటోను జతపరచి 28వ తేదీ ఉదయం 9గంటల్లోపు గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం 11 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.

గని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



మొక్క నాటుతున్న డీఎంఎస్ రఘుపతి

సైదాపురం : గని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని నెల్లూరు రీజియన్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ అధికారి రఘుపతి పైడిరెడ్డి తెలిపారు. గనుల భద్రతావారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం చాగణం సమీపంలోని గంగమ్మ మైకా గని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తమ రీజియన్ పరిధిలోని 50 గనుల్లో భద్రతా వారోత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గనుల్లో పనిచేసే సమయంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాలకే ప్రమాదముంటుందని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో మహిళలు కూడా గనుల ద్వారా ఉపాధి పొందడం విశేషమని వెల్లడించారు. అనంతరం గని వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో గని యాజమానులు సురేష్‌రెడ్డి, శివరామిరెడ్డి, మేనేజర్లు వాసు, ప్రవీణ్, పురుషోత్తం, సాయి, శ్రావణ్, ప్రసాద్, కె.శ్రీనివాసులు, శివయ్య, రంగారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

సత్యవేడు:ఆంధ్ర–తమిళనాడు సరిహద్దులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. సత్యవేడు బీసీ కాలనీకి చెందిన హన్సర్(35), నీలయ్య (50) తమిళనాడులో తాపీ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా కంటైనర్ ఢీకొంది.హన్సర్ అక్కడికక్కడే మరణించాడు. నీలయ్యను సత్యవేడులో ఆస్పత్రికి తరలించగా డాక్టర్ పరీక్షిస్తుండగానే మృతి చెందాడు. సీఐ దివాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్ : జిల్లాలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 190.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా దొరవారిసత్రం మండలంలో 29.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఓజిలి మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని వివరించారు. అలాగే బాలాయపల్లెలో 22.4 మిల్లీమీటర్లు, పెళ్లకూరులో 20.4, డక్కిలిలో 17.2, వెంకటగిరిలో 16.6, గూడూరులో 13.4, సూళ్లూరుపేటలో 12.8, నాయుడుపేటలో 11.6, తొట్టంబేడులో 10.4, చిల్లకూరులో 8.6, శ్రీకాళహస్తిలో 7.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

ఎర్రచందనం సహా కారు సీజ్



ఎర్రదుంగలు, సీజ్ చేసిన కారుతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

తిరుపతి మంగళం: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలతో పాటు ఒక కారును తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. తిరుపతి డీఎఫ్ఓ ఎం. శివకుమార్‌కు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం పీలేరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ జి. కోదండన్, వై. చంద్రబాబు, సాయికిరణ్, వినోద్, నాగులయ్య తనిఖీలు నిర్వహించారు. మారుతీ స్విఫ్ట్ కారు ఆపకుండా వెళ్లిపోయారని, వారిని వెంబడించగా కారు వదిలిపెట్టి స్మగ్లర్లు పారిపోయారని డీఎఫ్ఓ తెలిపారు. కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నాయని, వాటి బరువు సుమారు 1,285 కేజీలు ఉండవచ్చని వెల్లడించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



సీఐ సమక్షంలో బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న స్కౌట్ అండ్ గైడ్ సభ్యులు

శ్రీకాళహస్తి : తిరుపతి బస్టాండ్‌లో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని శ్రీకాళహస్తిలో అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతి– సత్యవేడు బస్సు నుంచి మంగళవారం యోగేష్ అనే బాలుడు నాగలాపురం బస్టాండ్‌లో దిగాడు. అయోమయంగా చూస్తున్న యోగేష్‌ను అయ్యప్ప అనే వ్యక్తి తనతోపాటు శ్రీకాళహస్తికి తీసుకువచ్చాడు. స్థానిక స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ సభ్యులకు అప్పగించాడు. స్కౌట్ మాస్టర్ ఉప్పు సుబ్రమణ్యం, స్కౌట్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, వలంటీర్లు, ఆశ వర్కర్లు సోషల్ మీడియాలో ఆ అబ్బాయి వివరాలను వైరల్ చేశారు. వాట్సాప్‌లో యోగేష్ సమాచారం చూసిన తండ్రి సుబ్బరాయుడు వెంటనే శ్రీకాళహస్తికి చేరుకున్నాడు. స్థానిక భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సీఐ నరసింహారావు సమక్షంలో బాలుడిని తండ్రికి అప్పగించారు . సుబ్బరాయుడు మాట్లాడుతూ స్కూలులో చేర్పించేందుకు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉండగా అక్కడ నిలిచి ఉన్న సత్యవేడు బస్సులో తమ అబ్బాయి ఎక్కేసి ఉంటాడన్నారు. బిడ్డ కోసం తిరుపతిలో ముమ్మరంగా గాలిస్తున్నామని, తమ కుమారుడిని క్షేమంగా చేర్చినందుకు స్కౌట్ సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు.

చెట్టును ఢీకొన్న బైక్: వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన రవికుమార్ (ఇన్‌సెట్) రవికుమార్(ఫైల్)

సదుం: చెట్టును బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మండల కేంద్రానికి చెందిన రవికుమార్ (44) తిరుమలలో కాంట్రాక్టు క్షురకునిగా పని చేస్తున్నాడు. మంగళవారం తిరుమలకు వెళ్లిన విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై సదుంకు బయలుదేరారు. సరిగ్గా ఊరి సమీపంలో భట్టువారిపల్లె గుట్ట వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టును అదుపుతప్పి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం పీలేరుకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు–కారు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



కారును ఢీకొన్న బస్సు



తీవ్రంగా గాయపడిన ఇక్బాల్ అల్తాఫ్ జమాన్



అల్లాషాదిన్

గుడిపాల: బస్సు–కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు, చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని నరహరిపేట సమీపంలో భద్రకాళమ్మ గుడి వద్ద బుధవారం చిత్తూరు నుంచి వేలూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు, చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారును ఢీ కొనడంతో కారులో ఉన్న ఇద్దరు భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరుకు చెందిన ఇక్బాల్ అల్తాఫ్ జమాన్(55), అల్లాషాదిన్(50)కి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు వేటగాళ్ల అరెస్ట్



వేటగాళ్ల అరెస్ట్ చూపుతున్న అటవీ సిబ్బంది

వరదయ్యపాళెం: వన్యప్రాణిని హతమార్చిన వేటగాళ్లను అటవీశాఖ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు కథనం మేరకు.. వెంగారెడ్డికండ్రిగ చెరువు సమీపంలో ఇద్దరు వ్యక్తులు వేటకు వెళ్లి వన్యప్రాణులను హతమారుస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో కాంబాకం సెక్షన్ అటవీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో లైసెన్సు లేని తుపాకీతో జింకను వేటాడి, మాంసాన్ని అమ్మకానికి సిద్ధం చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో నిందితులు నక్కలమిట్టకు చెందిన రాజ వెంకట్ అలియాస్ శరత్‌కుమార్ (31), సత్యవేడు మండలం మాదనపాళానికి చెందిన ఎస్.రామకృష్ణ (38)గా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి నాటు తుపాకీ, మోటారు బైక్ స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని సత్యవేడు కోర్టులో హాజరు పరిచినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు.

ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం



విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అక్షర దీవెన ఉత్సవం పేరిట ఏటా జరిపించే సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు , ఏసీ మల్లికార్జున, డిప్యూటీ ఈఓ ఏకాంబరం , డి.శ్రీనివాసులురెడ్డి చేతులమీదుగా చిన్నారులతో పలకలపై ఓం నమఃశివాయ అని అక్షరాలు దిద్దించారు. అక్షర దీవెన సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ప్రధానంగా సుపథ మండపం, కంచు గడపల వద్ద పూలమాలలతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. గురు దక్షిణామూర్తిని విశేషంగా అలంకరించి సరస్వతీదేవి పూజలు చేశారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపాలు, పెన్నులు, బియ్యం, పులిహోర, లడ్డూలను అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు బాలయ్య, కృష్ణారెడ్డి, నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు